AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

9-9-2025 | NIZAMABAD / KAMAREDDY | Tuesday

## గరిష్ట స్థాయికి బంగారం ధర



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బంగారం ధర పరుగులు పెడుతోంది. రోజురోజు పైపైకి ఎగబాకుతోంది. మంగళవారం దేశీయంగా బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి.డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. నేడు 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,10,290గా నమోదు కాగా, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,01,110గా ట్రేడ్ అయింది. ఇక వెండి ధర రూ. 1,40,000గా ఉంది.

## నేటి నుంచి ఆసియా కప్..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియా కప్ 2025 కోసం క్రికెట్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. టీ20 ఫార్మాట్‌లో జరగనున్న ఈ మెగా టోర్నమెంట్ నేడు సాయంత్రం 8 గంటలకు ప్రారంభం కానుంది. టోర్నీ మ్యాచ్‌లు అబుదాబి, దుబాయ్ వేదికగా జరుగనున్నాయి. ఆసియాలోని మొత్తం 8 జట్లు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. గత టోర్నీ విజేతగా ఉన్న టీమిండియా ఈసారి డిఫెండింగ్ ఛాంపియన్ హోదాతో బరిలోకి దిగుతోంది. గ్రూప్ 'ఏ'లో భారత్, పాకిస్తాన్, యూఏఈ, ఒమన్ జట్లు ఉండగా.. గ్రూప్ 'బీ' లో శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్తాన్, హాంకాంగ్ ఉన్నాయి. కాగా.. టీమిండియా తొలి మ్యాచ్‌ను బుధవారం యూఏఈతో ఆడనుంది.



## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన అధికారిణి

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ శివారులోని నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారిణి మణి హారిక రూ.4 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. మున్సిపల్ పరిధిలో ఓ వ్యక్తి ఎల్‌ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఆ ఫైల్‌ను క్లియర్ చేయడానికి టౌన్ ప్లానింగ్ అధికారిణి మణిహారిక రూ.పది లక్షల లంచం డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఈ క్రమంలో మంగళవారం బాధితుడి నుంచి రూ. నాలుగు లక్షల లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు ఆమెను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసులో తనిఖీలు నిర్వహించారు. ఆమెపై కేసు నమోదు చేసి, అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.



## శిశువును ఫ్రీజర్‌లో పెట్టి మరిచిపోయిన తల్లి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లోని మొరాదాబాద్ జిల్లాలో చోటు చేసుకున్న ఓ ఘటన కలకలం సృష్టించింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఓ తల్లి ప్రసవానంతరం తన 15 రోజుల పసిబిడ్డను పొరపాటుగా ఫ్రీజర్‌లో ఉంచింది. శుక్రవారం రాత్రి తన బిడ్డను నిద్రపుచ్చిన తల్లి ఆ శిశువును తీసుకు వెళ్లి ఫ్రీజర్‌లో పెట్టి తాను కూడా నిద్రలోకి జారుకుంది. అయితే చలిని తట్టుకోలేక బిడ్డ ఏడవడం ప్రారంభించింది. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది ఇల్లంతా వెతికారు. చివరికి రిఫ్రిజిరేటర్‌లో అపస్మారక స్థితిలో ఉన్న శిశువును గుర్తించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమయానికి ఆసుపత్రికి తీసుకెళ్లడం వల్ల ప్రమాదం తప్పిందని వైద్యులు చెప్పారు. సదరు మహిళ ప్రసవానంతరం పోస్ట్ పార్టమ్ డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది.

**రాష్ట్రంలో గ్రూప్–1 పరీక్షల కథ మళ్లీ మొదటికి వచ్చింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటి సారి వెలువడిన నోటిఫికేషన్ ముందుకు సాగడం లేదు. ఇప్పటికే రెండుసార్లు ప్రిలిమ్స్ పరీక్ష రద్దు కాగా.. తాజాగా మెయిన్స్‌ను రద్దు చేస్తూ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. దీంతో ర్యాంక్ వచ్చిన అభ్యర్థులు ఆందోళన చెందుతుండగా.. మిగతా వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా.. హైకోర్టు తీర్పుపై టీజీపీఎస్సీ అప్పీల్‌కు వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.**

**-అక్షరటుడే, హైదరాబాద్**

## గ్రూప్–1 కథ



# మళ్లీ మొదటికి..

■ హైకోర్టు సంచలన తీర్పు ■ పరీక్షలు మళ్లీ నిర్వహించాలని టీజీపీఎస్సీకి ఆదేశం

గ్రూప్-1 పరీక్షలపై తెలంగాణ హైకోర్టు మంగళవారం సంచలన తీర్పు వెలువరించింది. గతంలో నిర్వహించిన మెయిన్స్ పరీక్షను రద్దు చేసిన న్యాయస్థానం.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించింది. గతంలో ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితాను రద్దు చేస్తూ జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. రీ వాల్యుయేషన్ చేయాలని ఆదేశించిన న్యాయస్థానం.. వాటి ఆధారంగా ఫలితాలు వెల్లడించాలని సూచించింది. ఒకవేళ రీవాల్యుయేషన్ సాధ్యం కాకపోతే మళ్లీ పరీక్షలు నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించింది. 8 నెలల్లోపు పరీక్షలు జరపాలని స్పష్టం చేసింది.

గ్రూప్-1 మూల్యాంకనంలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, పరీక్షలను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కొంతమంది అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఇప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయి ఉత్తర్వులు అందుకునే దశలో ఉన్న పరీక్షలను రద్దు చేయరాదంటూ ఎంపికైన అభ్యర్థులు కూడా కోర్టును ఆశ్రయించారు. ఇలా అభ్యర్థులు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు మంగళవారం ఈ మేరకు తీర్పు వెలువరించింది.

### సుదీర్ఘ విచారణ..

గ్రూపు 1 పరీక్ష నిర్వహణలో అవకతవకలు జరిగాయని వాటిని రద్దు చేయాలని కొందరు తమ వాదన వినిపించగా, రద్దు చేయవద్దంటూ మరికొందరు వేసిన పిటిషన్లపై జూలై 7న వాదనలు జరిగాయి. మరోవైపు, గ్రూప్1 మెయిన్స్ సమాధాన పత్రాల మూల్యాంకనంలో ఎలాంటి లోపాలు జరగలేదని టీజీపీఎస్సీ హైకోర్టుకు తెలిపింది. అంతేకాక మెయిన్స్ పరీక్షను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని వివరించింది. ఇప్పటికే గ్రూప్1 పరీక్షల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. కానీ, హైకోర్టులో కేసు విచారణ దృష్ట్యా కమిషన్ నియామక ఉత్తర్వులు జారీ చేయలేదు. తాజాగా కోర్టు తీర్పుతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది.

### మూడో సారి..

గ్రూప్-1 నోటిఫికేషన్ 2022లో వెలువడింది. 2022 సెప్టెంబర్ 16న పరీక్ష నిర్వహించారు. అప్పుడు పేపర్ లీకేజీ వ్యవహారం వెలుగులోకి రావడంతో పరీక్ష రద్దు చేశారు. మళ్లీ 2023 జూన్ 11న పరీక్ష జరగ్గా.. బయోమెట్రిక్ తీసుకోలేదని పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో పరీక్షను రద్దు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. మరోసారి 2024 జూన్‌లో పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫలితాలు ప్రకటించి మెయిన్స్ కోసం అభ్యర్థులను ఎంపిక చేశారు. మెయిన్స్ పరీక్షలు 2024 అక్టోబరు 21 నుంచి 27 వరకు జరిగాయి. 2025 మార్చి 10న వీటి ఫలితాలు విడుదలయ్యాయి. అయితే కొందరు అభ్యర్థులు మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని కోర్టును ఆశ్రయించారు. ర్యాంకింగ్ లిస్ట్ ఆధారంగా నియామక ప్రక్రియ కూడా దాదాపు పూర్తయింది. కోర్టులో కేసు ఉండడంతో టీజీపీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వలేదు. దీంతో న్యాయస్థానం మళ్లీ మూల్యాంకనం చేయాలని, లేదంటే పరీక్ష మళ్లీ నిర్వహించాలని ఆదేశించింది.

## మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సెక్రెటరీగా తిరుపతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సెక్రెటరీగా జగిత్యాల జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకుంది. పార్టీ కేంద్ర కమిటీ సెక్రెటరీగా ఉన్న నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మే నెలలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నంబాల మృతి చెందారు. ఆయన మరణించిన మూడున్నర నెలల తర్వాత సెక్రెటరీని నియమిస్తూ కేంద్ర కమిటీ నిర్ణయం తీసుకుంది.

### మిలటరీ ఆపరేషన్లలో దిట్ట

జగిత్యాల జిల్లా కోరుట్లలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన తిరుపతి అలియాస్ దేవుజీ మిలటరీ ఆపరేషన్లలో దిట్ట. గతంలో ఆయన పలు కీలక బాధ్యతల్లో పనిచేశారు. నంబాల మృతితో ఖాళీగా ఉన్న పదవికి పలువురి పేర్లు పరిశీలనలోకి రాగా.. కేంద్ర కమిటీ తిరుపతి వైపు మొగ్గు చూపింది. ఆయన ప్రస్తుతం మిలటరీ కమిషన్ చీఫ్‌గా, పొలిట్ బ్యూరో సభ్యుడిగా కొనసాగుతున్నారు.

## ముంబైలో ఈగల్ టీమ్ స్పెషల్ ఆపరేషన్



**అక్షరటుడే, హైదరాబాద్:** ముంబైలో తెలంగాణ ఈగల్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. డెకాయి ఆపరేషన్ నిర్వహించి డ్రగ్స్, హవాలా నెట్‌వర్క్‌ను ఛేదించారు. ఇందులో భాగంగా డ్రగ్స్ విక్రయించి, నైజీరియాకు హవాలా ద్వారా డబ్బులు పంపుతున్న గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. మొత్తం 24 మందిని అదుపులోకి తీసుకోగా.. ఇందులో ముంబైకి చెందిన 14 మంది వ్యాపారులు ఉండడం గమనార్హం. కాగా.. ముంబై పోలీసులు ఇటీవల తెలంగాణలో స్పెషల్ ఆపరేషన్ చేపట్టి రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా తెలంగాణ ఈగల్ టీమ్ పోలీసులు ముంబైలో డెకాయి ఆపరేషన్ నిర్వహించడం గమనార్హం.

## అల్లు అరవింద్‌కు జీహెచ్‌ఎంసీ షోకాజ్ నోటీసులు..



**అక్షరటుడే, సినిమా డెస్క్:** అల్లు ఫ్యామిలీకి రాష్ట్ర ప్రభుత్వం వరుస షాకులు ఇస్తోంది. పుష్ప-2 వివాదంతో అల్లు అర్జున్ ఉక్కిరిబిక్కిరి కాగా.. ప్రస్తుతం అల్లు ఫ్యామిలీకి మరోసారి షాక్ తగిలింది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్‌కు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఇటీవల తల్లి మరణం అనంతరం కుటుంబం దుఃఖంలో ఉన్న సమయంలోనే ఈ నోటీసులు రావడం గమనార్హం. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 వద్ద ఉన్న అల్లు బిజినెస్ పార్క్ భవన నిర్మాణంపై అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భవనానికి నాలుగు అంతస్తుల వరకు మాత్రమే అనుమతి ఉండగా.. పర్మిషన్ లేకుండా పెంట్‌హౌస్‌ను నిర్మించినట్లు తెలుస్తోంది. దీనిపై స్పష్టత ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

## నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి రాజీనామా



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి తన పదవికి రాజీనామా చేశారు. సోషల్ మీడియాపై బ్యాన్ విధిస్తూ తీసుకున్న నిర్ణయం ఆయన సీటుకే ఎసరు పెట్టింది. నేపాల్ ప్రభుత్వం ఇటీవల పలు సోషల్ మీడియా యాప్‌లను నిషేధించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని వాటిని బ్యాన్ చేసింది. అయితే నేపాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆ దేశ యువతకు నచ్చలేదు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. సోషల్ మీడియాపై బ్యాన్ ఎత్తివేయాలని, ప్రభుత్వంలో అవినీతి పెరిగిందని ఖాట్మాండులో నిరసనలు చేపట్టారు.

### పలువురి మృతి

నేపాల్ యువత చేపట్టిన ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. వారు పార్లమెంట్‌ను ముట్టడించారు. మంత్రుల ఇళ్లపై దాడులు చేశారు. ఈ క్రమంలో పోలీసులు రబ్బర్ బుల్లెట్లతో కాల్పులు జరపగా పలువురు మృతి చెందారు. ఆందోళనలు తీవ్రతరం కావడంతో మంగళవారం ఉదయం నేపాల్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సోషల్ మీడియాపై బ్యాన్‌ను ఎత్తివేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరగడంతో ప్రధాని శర్మ తన పదవిని కోల్పోయారు. కాగా.. సైన్యం సూచనతో ప్రధాని కేపీ శర్మ ఓలి తన పదవికి రాజీ నామా చేశారు. ఇటీవల చోటు చేసుకున్న హింసాత్మక ఘటనలతో సైన్యం సూచన మేరకు ఆయన పదవి నుంచి తప్పుకున్నట్లు సమాచారం. ఇప్పటికే పలువురు మంత్రులు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలో నేపాల్ కొత్త ప్రధానిని ప్రకటించే అవకాశం ఉంది.

## ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎన్నిక లాంఛనమే!

**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఉపరాష్ట్రపతిగా ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక లాంఛనమే కానుంది. మంగళవారం ఉదయం 10 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు మొత్తం కలిపి 781 మంది ఓటర్లు ఉండగా మధ్యాహ్నం మూడు గంటల వరకు 96 శాతం పోలింగ్ నమోదైంది. జగదీప్ ధన్‌ఖడ్ అనారోగ్య కారణాలతో రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఎన్డీఏ నుంచి మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ బరిలో ఉండగా.. ఇండి కూటమి నుంచి బి.సుదర్శన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. రాత్రి వరకు పోలింగ్ ఫలితాలు వస్తాయి. కాగా.. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో గెలవాలంటే 391 ఓట్లు అవసరం. ఎన్డీయేకు 425 మంది సభ్యుల బలం ఉంది. ఈ నేపథ్యంలో సీపీ రాధాకృష్ణన్ గెలుపు లాంఛనం కానుంది. దీనికి తోడు వైసీపీ ఎన్డీఏ అభ్యర్థికి మద్దతు తెలిపింది. ఆప్ ఎంపీ స్వాతి మాలివాల్, ఆర్జేడీ ఎంపీ గిరిధర్ లాల్ యాదవ్ సైతం ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.



## యాక్సిడెంట్ వార్తలపై స్పందించిన కాజల్..

సెలబ్రిటీల గురించి చాలాసార్లు పుకార్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా నటి కాజల్ అగర్వాల్ గురించి కూడా ఓ వార్త వైరల్ అయింది. సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో 40 ఏళ్ల ఈ ముద్దుగుమ్మ చనిపోయిందని పుకార్లు వచ్చాయి. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తర్వాత నటి మరణించిందని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఈ పుకార్లు ఆమె అభిమానులను ఆందోళనకు గురి చేశాయి. కాగా.. పుకార్లపై స్పందించిన కాజల్ అగర్వాల్ అవి పూర్తిగా అవాస్తవమని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. దేవుని దయ వల్ల తాను పూర్తిగా క్షేమంగా, చాలా బాగానే ఉన్నానని పేర్కొంది.

**-అక్షరటుడే, సినిమా డెస్క్**

